

తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ


రికార్డుల గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె(పుల్లంపేట)

ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా తయారు చేయాలని కలెక్టర్ గిరీష అధికారులకు సూచించారు. మంగళవారం ఓబులవారిపల్లి మండలం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిఎల్ఓ స్థాయిలో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా ఉండాలని అధికారులను ఆదేశించారు. బిఎల్ఓలు చేసిన వెరిఫికేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సేవకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతున్న గ్రామ సేవకులు

కలెక్టరేట్ ఎదుట నిరసనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామ సేవకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట గ్రామ సేవకులు మోకాళ్లపై కుర్చోని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి గ్రామ సేవకులను రెగ్యులర్ చేస్తానని, వేతనం పెంచుతానని, పిఆర్‌సి అమలు చేస్తానని అబద్ధపు హామీలతో పోస్టులు వేయించుకుని అధికారం చేపట్టిన తర్వాత హామీలు అమలు చేయకపోగా ఇచ్చిన డిఎను వెనక్కి లాక్కున్నారని వాపోయారు. డిఎ రూ.300 నుంచి రూ.600 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. విఆర్ఎ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన విరమించుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నామినీలను విఆర్ఎలుగా నియమించాలని, అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. విఆర్ఎ వ్యవస్థ లేకుండా చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, వచ్చే ఎన్నికల్లో గ్రామ సేవకులు బుద్ధి చెబుతారని తెలిపారు. డిఎలు ఇవ్వాలని రీ సర్వేలో పాల్గొంటున్న ప్రతి విఆర్ఎకు టిఎ, డిఎతోపాటు ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలన్నారు. వేసవిలో తీవ్ర ఎండలకు రీ సర్వేలో పాల్గొని గుండెపోటుతో చని పోయిన గ్రామ సేవకుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకో వాలన్నారు. కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలిపారు. వారికి ప్రత్యేక అలవెన్స్, రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని పేర్కొన్నారు. గుర్తింపు కార్డు లతో పాటు సంక్షేమ పథకాలు అమలుచేయాలని ప్రతి ఒక గ్రామ సేవకునికీ 2 ఎకరాల భూమి, 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఒ సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం జిల్లా కో- కన్వీనర్ జి.భోగేశ్వరయ్య రైల్వేకోడూరు డివిజన్ అధ్యక్షుడు కె.సుధాకర్, కలికిరి రెడ్డెప్ప, పెనగలూరు మధు, శీను రాయచోటి అధ్యక్షులు పి.నర్సింహులు ఆర్.రామ్మోహన్, చంద్రాయుడు, రామయ్య, శివప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం

వసతుల లేమితో గిరిజనం

పూరి గుడిసెలే వారి ఆవాసాలు

ఆధార్ లేక అందని సంక్షేమ పథకాలు

గ్రామాల వైపు కన్నెత్తి చూడని అధికారులు

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


చిట్వేలి మండలంలోని మైలపల్లి యానాది కాలనీ

ప్రజాశక్తి-రాయచోటి

మారుమూల పల్లెల్లో నివసించే గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతూనే ఉన్నాయి. ఫలితంగా వారి అభివృద్ధి కుంటుపడుతోంది. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంగా గిరిజనులు ఉన్నారు. గిరిజనుల్లో ఒక తెగగా చెప్పుకునే యానాదులు.. ఏ ఒక్క ప్రభుత్వ పథకాలు అందుకోలేని అనాథలుగా మిగిలిపోవడం చాలా బాధాకరం. గుట్ట, పుట్ట పట్టుకుని పూట గడుపుతున్న యానాదుల ధీనగాద అంతా ఇంతా కాదు. జిల్లాలో సుమారు 25 యానాదులు కాలనీలు ఉన్నాయి. లక్షకుపైగా జనాభా ఉన్నారు. ఆధార్ లేక కొందరు, రేషన్‌కార్డు లేక మరి కొందరు మన కోసం పథకాలు ఉన్నాయా అన్న ఆమోమయంలో ఉన్నారు. కనీసం వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటైనాకైనా వారికి ప్రభుత్వ పథకాలు చేరడం లేదు. యానాదుల పిలలకు ఆధారు కార్డు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకొని, వారిని పాఠశాలల్లో చేర్పించే సామాజిక బాధ్యత లేని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకోవడానికే పనికొస్తాయి. అధికారులు నిర్లక్ష్యం ఎక్కువ శాతం కనబడుతోంది. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కథనం..

జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లి, గాలివీడు, రాయచోటి మండలాల్లో యానాదుల కాలనీలు ఉన్నాయి. వారిని అభివృద్ధి చేసేందుకు నెల్లూరు జిల్లాలో ఐటిడిఎ ఆఫీసు ఏర్పాటు చేశారు. అక్కడున్న ప్రాజెక్టు అధికారి ఇంత వరకూ యానాది కాలనీలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. యానాదులు సమస్యలు పరిష్కరించిదానికి మొగ్గు చూపడం లేదు. యానాదులు వెనుక బడిబాట కారణం ఐటిడిఎ అధికారులే. ఇప్పటికైనా స్పందించి యానాదులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని యానాదులు కోరుతున్నారు. ఆధార్ కార్డుల కోసం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నివేదికలు పంపినా నెల్లూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చీమ కుటినట్లు కూడా లేదని గిరిజనులు వాపోతున్నారు. యానాదులు కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని యానాది సంక్షేమ సంఘం వినతి పత్రం సమర్పించినా ప్రాజెక్టు అధికారి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని యానాది నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు లేక తమ పిల్లలను స్కూళ్లల్లో కూడా చేర్పించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి స్పందించి వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

యానాదులు ఎక్కువగా ఉన్న రైల్వేకోడూరులో ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి. ఐటిడిఎ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

- జలకం శివయ్య, జిల్లా అధ్యక్షులు, యానాదులు సంక్షేమ సంఘం. అన్నమయ్య.

కాలనీలు అభివృద్ధి చేయాలి

యానాదుల కాలనీల్లో అనేక సమస్యలు ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ నిధులు యానాది కాలనీలో అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి.

- సికోలి బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షులు, యానాదుల సంక్షేమ సంఘం, అన్నమయ్య.

కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి చర్యలు : గిరీష

ప్రజాశక్తి-రాజంపేట

కేంద్రీయ విద్యాలయలో ముఖ్యమైన మరమ్మతులకు ఎస్టిమేట్ తయారు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాజంపేటలోని కేంద్రీయ విద్యాలయలో కలెక్టర్ అధ్యక్షతన విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పాఠశాలలో వైట్ వాషింగ్ చేయించడం, బాలబాలికల మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించడం వంటి పలు అంశాల మీద చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలబాలికల మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించడం వంటి ముఖ్యమైన పనులకు ఎస్టిమేట్ తయారుచేసి తన దగ్గరకు తీసుకురావాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయలో పాస్ పర్సంటేజీ చాలా బాగా ఉందని తెలిపారు. దీనిని ఇలాగే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. సమావేశంలో రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

మంగంపేట నిర్వాసితులకు త్వరలో ఆర్థిక సాయం : కలెక్టర్


లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష, జెసి, ఇతర అధికారులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి(పుల్లంపేట)

మంగంపేట నిర్వాసితులకు కేటాయించిన లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల నిర్మాణాలను ప్రారంభించాలని, నిర్వాసితుల పరిరక్షణ కమిటీ కోరిన విధంగా మాస్టర్ ప్లాన్‌ను మార్పు చేయడానికి సిద్ధమని కలెక్టర్ గిరిష తెలిపారు. మంగళవారం మంగంపేట గ్రామ పంచాయతీలోని నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఆర్థిక సాయం, వారికి కేటాయించిన స్థలంలో మౌలిక సదుపాయాల నిర్మాణం, మాస్టర్ ప్లాన్ గురించి అధికారులతో పరిరక్షణ కమిటీ సభ్యులతో చర్చించడానికి నిర్వాసితులకు కేటాయించిన బుక్కారంపల్లి వద్దనున్న లేఅవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు కేటాయించిన స్థలంలో సిసి రోడ్డు, డ్రెయినేజీ, పాఠశాల భవనం, విద్యుత్ లైన్లు, ఆటస్థలం, శ్మశానవాటిక, పార్క్ తదితర మౌలిక వసతుల నిర్మాణాలను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలు, తదితర అధికారులు లేఅవుట్‌లో ఏఏ సౌక ర్యాలు ఎక్కడ ఉంటాయో కలెక్టర్‌కు వివరించారు. లే అవుట్లలో ఇళ్లను కట్టుకోవ డానికి సౌకర్యంగా లేని ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించవద్దని ఆ స్థలాల ను వేరే విధంగా ఉపయోగించుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం ఎపిఎండిసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో మంగంపేట నిర్వాసితుల కమిటీతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాస్టర్ ప్లాన్‌లో వివిధ మార్పులను చేయమని కలెక్టర్‌ను కోరారు. వారు కోరిన విధంగా మార్పులు చేసేందుకు కలెక్టర్ సమ్మతించారు. కమిటీ సభ్యులు కోరిన విధంగా మార్పులు చేసి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం లే అవుట్ పూర్తి చేసి దానికి అనుసంధానంగా అంగన్వాడీ కేంద్రం ఆర్టీసీ బస్సుస్టాప్ తదితర ఇతర సౌక ర్యాలు కూడా అందజేస్తామని కమిటీ సభ్యులకు తెలియజేశారు. నిర్వాసితులకు ఆర్థిక సాయం గురించి కమిటీ సభ్యులు కోరగా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు డబ్బును అకౌంట్‌లోకి జమ చేయగానే నిర్వాసితులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలియజేశారు. దీనికి కావాల్సిన ఫామ్ సి మరియు ఫామ్ సిసిలను నిర్వాసితుల దగ్గర నుంచి త్వరితగతిన తీసుకోవాలని తహశీల్దార్‌కు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలు, రాజంపేట, ఓబులవారిపల్లె తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

విభిన్న ప్రతిభావంతులకు చేయూత : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమాజంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు సాధారణ వ్యక్తుల్లా జీవనం సాగించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వారికి అన్ని రకాల చేయూత అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గడిఒట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఐఇఆర్‌టి జిల్లా కో-ఆరినేటర్ జనార్దన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలు జిల్లా స్థాయి క్రీడా పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషతో కలసి ముఖ్యఅతిథిగా అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సహిస్తే సాధారణ వ్యక్తులతో పోటీ పడతారన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించి పిల్లల్లో మానసిక ఉల్లాసం నింపి వారికి మనోధర్యంతో ఉండేలా చూడాలన్నారు. క్రీడలతో పాటు చదువు కూడా చాలా ముఖ్యమని సూచించారు. ఇలాంటి పిల్లల కోసం ఏ అవసరం ఉన్నా, ఏ సహాయం కావాలన్నా తాను తోడుగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, కౌన్సిలర్లు ఆసిఫ్ అలీ ఖాన్, ఫయాజ్ అహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు నూకల నరసరాజు, లలితమ్మ, లక్ష్మీ నారాయణ, గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం బాధాకరం

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా ఉద్యమాలకు గద్దర్ మరణం తీరనిలోటని పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షులు పి. రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంబేద్కర్ ప్లెక్సీ వద్ద గద్దర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జనం గుండె చప్పుడై గళం ఎత్తిన ప్రజా కళాకారుడు, జననాట్యమండలి ఆవిర్భావకుడు, ప్రజా సాంస్కృతిక యోధుడు ,తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్ అని పేర్కొన్నారు. ఆయన పాట, మాట దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది అన్నారు. గద్దర్ రచయితగా కవిగా, గాయకుడిగా వాగ్గేయకారుడుగా ఒక చరిత్ర సృష్టించారు అన్నారు. గద్దర్ పౌర హక్కుల సంఘంతో ఆయనకున్న అనుబంధం మరువలేనిది అన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్, రోశయ్య, నక్క నారాయణ, న్యాయవాది నగముని, పామయ్య, ఆదిరెడ్డి నాయక్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ప్రజా గాయకుడు గద్దర్‌కు పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పృధ్వీ, సాదిక్ మాట్లాడుతూ గద్దర్ 50 ఏళ్లు తన కుటుంబానికి దూరంగా ఉంటూ తన ప్రాణం పోయినా ప్రజా ఉద్యమంలో ఉన్నారన్నారు. యువతను ఎర్రబాటలో నడిపించిన మహోన్నతమైన గొప్ప విప్లవకారుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినయ్, తరుణ్, అశోకు, జీవనం, చరణ్, చిన్నప్ప, సురేంద్ర పాల్గొన్నారు.



రాయచోటి : గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా

టిడిపి చిల్లర రాజకీయాలు మానుకోవాలి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

టిడిపి నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక 14వ వార్డు వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లా డుతూ అధికారానికి దూరమై తెలుగుదేశం పార్టీ ప్రజాదరణ కోసం ప్రాకులాడుతున్న ప్రతిపక్ష పార్టీ నాయకుడు టిడిపి శ్రేణులను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పడం దుర్మార్గమన్నారు. మదనపల్లికి వచ్చిన తెలు గుదేశం పార్టీ మాజీ మంత్రులు, పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి డాక్టర్ రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డిలపై చేసిన విమర్శలను తిప్పి కొడుతూ తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షబాన, తంబళ్ళపల్లి, శీలంవారిపల్లి, సర్కార్ తోపు సర్పంచులు షేక్ మదార్ సాబ్, రమాదేవి, షంతాజ్, సుమియా, కావ్య, గీతలు పాల్గొనారు.

మంత్రి పెద్దిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజా శ్రేయస్సుకై అనునిత్యం పరితపించే నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలపై టిడిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు తగవని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేంద్రనాథ్, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎంపిపి అనసూయ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి మాట్లాడుతూ సోమవారం మదనపల్లి టిడిపి నాయకులు నిర్వహించిన ర్యాలీ హాస్యాస్పదమని పేర్కొన్నారు. తన సొంత నియోజకవర్గంలో గెలవలేని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లి సర్పంచ్ శ్రీనివాసులు, సీలంవారిపల్లి సర్పంచ్ నాగిరెడ్డి, వైసిపి రాజంపేట జాయింట్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

మదనపల్లె అర్బన్ : యువత క్రీడాస్ఫూర్తితో ఆడుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని మదనపల్లె వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక బిటి కళాశాల మైదానంలో బివిఎల్ సయెద్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-1ను ప్రారంభించారు. 3 రోజులు పాటు జరిగే ఈ టోర్నమెంటులో 32 టీమ్స్ పాల్గొననున్నాయి. 10వ తేదీ ఫైనల్స్ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు రూ.30 వేలు ప్రైజ్ మణి అందజేస్తామన్నారు. రన్నర్స్‌కు రూ.15 వేలు, మ్యాన్ అఫ్ ది మ్యాచ్, మ్యాన్ అఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్ మెన్ ప్రైజెస్ అందజేయనున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభతో రాణిస్తూ, రాష్ట్ర దేశస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

రాయచోటి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీషా పిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10. 30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్పందన హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని గిరిజన ప్రజా ప్రతినిధులు, గిరిజన ప్రభుత్వ ఉద్యోగులు, గిరిజన సంఘ నాయకులు, గిరిజన ప్రజలు, విద్యార్థులు అందరూ పాల్గొని రాయచోటిలో నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి : సిపిఎం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మూడు నెలలు దాటినా మణిపూర్‌లో శాంతిని కాపాడలేని కేంద్ర ప్రభుత్వ వైఖరిని సిపిఎం పట్టణ కార్యదర్శి ప్రభాకరరెడ్డి తీవ్రంగా ఖండించారు. మణిపూర్ మారణకాండను నిరసిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష వైఖరివల్ల ఈదుస్థితి ఏర్పడిందన్నారు. దాదాపు 200 మంది ప్రజలను బలిగొన్న హత్యాకాండ వల్ల దేశం ఉలిక్కి పడిందని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని, మహిళలపై చెప్పలేని ఆకృత్యాలు జరిగాయన్నారు. కేంద్రం కళ్ళు తెరవాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు హరిశర్మ మాట్లాడుతూ పార్లమెంటులో ప్రకటనచేయలేని ప్రధాని వైఖరిని ఖండించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని ఉరితీయాలన్నారు. ఇప్పటికైన రాష్ట్రపతి జోక్యం చేసుకొని ప్రజలను కాపాడాలన్నారు. గుజరాత్లో ముస్లింలపై జరిగిన దాడులవలె ఇప్పడు మణిపూర్ కుకీలు మైనారిటీ క్రిష్టయన్లపై జరుగుతున్నాయని, మతోన్మాద కార్పొరేట్ శక్తులే ఈ దారుణాలకు కారణమన్నారు. పట్టణంలో పలుప్రాంతాల్లో కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రఘునాథ్, యువజన నాయకుడు పవన్, కార్మిక నాయకులు సుందర్, శివ పాల్గొన్నారు.

దళితులపై దాడులను ఆపాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన దళితులపై జరుగు తున్న దాడులను వెంటనే ఆపాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు అమావాస్య రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన కొత్తపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు గిరిజన దళితులపై భారీగా దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగు సంవత్సరాల కాలంలోనే గిరిజనులు, దళితులపై భారీ ఎత్తున దాడులు జరుగుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిం దన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో అనేక కేసులు నమోదయ్యాయి అన్నారు. రాష్ట్రంలో గిరిజనులు దళితులు ఓట్లు వేసి గెలిపించుకున్నందుకు వారికి అన్యాయమే తప్ప న్యాయం ఎక్కడ జరగడం లేదు అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గిరిజనులు, దళితులపైన దాడులు జరగకుండా అరికట్టాలని గిరిజనసంక్షేమ పథకాలను దళిత సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి అన్నారు. ఇలాగే దాడులను కొన సాగితే రానున్న రోజుల్లో గిరిజనుల దళితులు కలిసి రాబోయేలో ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్ దాసు, రమణయ్య పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి


రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పీలేరు

2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సౌకర్యంగా తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీలన్నీ తమకు సహకరిం చాలని ఎన్నికల నమోదు అధికారి గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు ధనుంజయులు ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గ స్థాయిలోని ఆరు మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇఆర్ఒ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతూన్న ఓటర్ల జాబితా ఎంక్వయిరీ కార్యక్రమం పారదర్శకంగా జరిగేలా చూడా లన్నారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, ఓటర్ల బదిలీలు, జాబితాలో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. ఓటర్ల నమోదు లేదా, తొలగింపు కోరుతూ అధిక మొత్తంలో ఎవరు దరఖాస్తులు తీసుకువచ్చినా ఫలితం ఉండదని అన్నారు. బిఎల్ఓల ద్వారానే ఆ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. 2024 జనవరి 5న ఓటర్ల జాబితా ఫైనల్ లిస్ట్ అందుబాటులోకి వస్తుందని, ఓటర్లు తమ పేర్లు ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలని చెప్పారు. 1500 మంది ఓటర్లకు ఒక్క పోలింగ్ స్టేషన్ వంతున కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలున్నాయని తెలియజేశారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో పీలేరు నియోజకవర్గం పరిధిలోని పీలేరు, కెవి పల్లి, కలకడ, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాల తహశీల్దారులు, ఎన్నికల విభాగం డిటిలు పాల్గొన్నారు.


గృహ నిర్మాణాల నాణ్యతను పరిశీలిస్తున్న వ్యాప్‌కో టీం సభ్యులు

గృహ నిర్మాణాల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణ పనులను చెన్నైకి చెందిన సంస్థ వ్యాప్‌కో టీం లీడర్ కరీముల్లా, హౌసింగ్ ఏఈ అమర్నాథ్ లతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాప్ కో టీం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా మంజూరైన జగనన్న పక్కా గృహాలను పరిశీలిస్తున్నామన్నారు. టిపిక్యూఎంఎ ప్రాజెక్ట్ నుంచి ఇచ్చిన నివేదిక నిర్మాణమవుతున్న పక్కా గృహాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. మండలంలోని దండువారిపల్లి, దిగువపల్లి, వెంకోజీగారిపల్లి, కొండయ్యగారిపల్లి లే అవుట్లలోని యుడిఎ 1920 ప్రాజెక్టు కింద మంజూరైన డిపిఆర్ 1038 గృహ నిర్మాణ పనులను లబ్ధిదారుల సమక్షంలో పరిశీలించామన్నారు. జగనన్న లేఅవుట్ లో లబ్ధిదారులు చేపట్టిన పక్కా గృహ నిర్మాణాలను, నాణ్యతను, కొలతలను, మౌలిక వసతులు నియమనిబంధనల ప్రకారం ఉన్నాయా అన్న అంశాలను పరిశీలించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు పటిష్టంగా పక్కా గృహ నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఇంజనీరింగ్ సహాయకులు నాణ్యతతో కూడిన నిర్మాణాలపై లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తిచేసేలా ఇంజనీరింగ్ సహాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ అమర్నాథ్, ఇంజనీరింగ్ సహాయకులు హేమ, అశ్విని, వరప్రసాద్, హౌసింగ్ సిబ్బంది అనూష, రవి పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక పూజలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆరవపల్లి రైల్వే కాలనీలో వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో మంగళవారం ఆడికృత్తిక సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేకువజామునే అభిషేకాలు నిర్వహించారు.


చెత్తదిబ్బలను పంచాయతీ సిబ్బందిచే తొలగింపజేస్తున్న సర్పంచ్

గ్రామ పరిశుభ్రతే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేట గ్రామపంచాయతీలో మంగళ వారం సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ప్రారంభించారు. పంచాయతీ మొత్తం ఎక్కడ చెత్త దిబ్బలు, మురికి కాలువలు, ప్లాస్టిక్, చెత్తాచెదారంతో కూడిన దిబ్బలను జెసిబి, ట్రాక్టర్ సహాయంతో పలు వీధుల యందు చెత్త తొలగింపజేశారు. గ్రామపంచాయతీ పచ్చదనం పరిశుభ్రత, ఆరోగ్యమే మహాభాగ్యం అనే దృఢ సంకల్పంతో సర్పంచ్ మొదటి రోజు నుంచి ఇదే సంకల్పంతో పనిచేస్తున్నానని తెలిపారు. పంచాయతీలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకుని వస్తే సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆజాది కా అమృత్ మహోత్సవ్ వేడుకలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా నేటి నుంచి మండలంలో నా భూమినా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో కార్యక్రమాల నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపిపి, జడ్‌పిటిసి, సింగిల్ విండో అధ్యక్షులు, ప్రత్యేక ఆహ్వానితులు, కో-ఆప్షన్ మెంబర్, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు, వార్డ్ మెంబర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, ప్రాంతీయ ప్రజా ప్రతినిధులు,ప్రజలను పంచాయతీ కార్యదర్శి సమన్వయపరచుకొని ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు వెబ్‌సైట్లో పొందుపరచాలన్నారు. మొదటి రోజు బయ్యప్పగారి పల్లె, శీలంవారిపల్లి, గొల్లపల్లి, బండారువారి పల్లెలలో జరుగుతుందని తెలిపారు.

కరుణాకర్‌రెడ్డి నియామకంపై హర్షం

తంబళ్లపల్లె : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా రెండవసారి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోసువారి పల్లి పంచాయతీ తరువానిపల్లెకు చెందిన శివారెడ్డి తనకు కరుణాకర్‌రెడ్డి సన్నిహితుడని ఆయన టిటిడి చైర్మన్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు సబ్ సెంటర్ క్రీడాకారుడి ఎంపిక

నందలూరు : కడప జిల్లా క్రికెట్ జట్టుకు అండర్-16 విభాగంలో నందలూరు సబ్ సెంటర్ క్రీడాకారుడు రోహిత్ ఎంపికయ్యాడు. త్వరలో నిర్వహించనున్న లీగ్ మ్యాచ్‌లో ఈ క్రీడాకారుడు పాల్గొంటాడు. సబ్ సెంటర్ నుంచి రోహిత్ ఎంపికపై సెంటర్ హెడ్ కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివ కోటి, క్యూరేటర్ హరి, కృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలకడ

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతల రామచంద్రా రెడ్డి చే నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించి ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఉన్న సమస్యలను విన్నవించుకున్నారు వాటిని వెంటనే పరిష్కరించి అధికారులు ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎపిఒ చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, షబానాభాను, సద్దాం హుస్సేన్, మునిరాజా పాల్గొన్నారు.


అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచిస్తున్న ఎంపిపి

పేదలకు అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్రంలోని నిరుపేదలకు అండగా నిలబడాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తూ, పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. మంగళవారం వెంగంవారిపల్లి పంచాయతీలోని కొత్త కొండసానివారిపల్లి, పాత కొండసానివారిపల్లి, ఎర్రివారి పల్లి, పిల్లగోవులపల్లిలో సర్పంచు జి.శ్రీవాణి నవీన్, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ నరసింహులు, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు లబ్ధి పొందిన వివరాలను చదివి వినిపించి, బుక్ లెట్ ను లబ్ధిదారులకు అందించారు. రాష్ట్రంలోని నిరుపేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. జగనన్న అందిస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతున్నాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం,


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

చంద్రాయుడు, మహదేవ రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మదనపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులు, నాయకులు నవీన్, మహేష్, నరేంద్ర రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, హేమంత్, శశిధర్ రెడ్డి, తహసిల్దార్ సి.ఆర్ మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, ఇఒపిఆర్‌డి చలపతిరావు, ఎస్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యం : ఆర్ఆర్


మేనిఫెస్టో పత్రాలను చూపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని టిడిపి మహిళా నాయకులు చంద్రకళ, సిద్ధక స్వాతిలు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని దప్పేపల్లి పంచాయతీలో మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి ఇంటికి వెళ్ళి తెలుగు పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. మేనిఫెస్టోలో మహిళలకు ప్రవేశపెట్టిన పథకాలైన మహాశక్తి, సంవత్సరానికి మూడు సిలిండర్లు, 18సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 రూపాయిలు, కుటుంబంలోని విద్యార్థులందరికీ రూ.15000లు అందించడం తో పాటు జిల్లా పరిధిలో మహిళకు ఉచిత బస్సు కల్పిస్తారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రకళ, సిద్ధక స్వాతి, సర్పంచ్ కేశవయ్య, రవిరెడ్డి, శ్రీరాములు, శ్యామలమ్మ, లక్ష్మీదేవి, వరలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమికి హద్దులు ఏర్పాటు

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని పెరియవరం రెవెన్యూ పంచాయతీలోని దిగువ రామక్కపల్లె గ్రామంలో గ్రామకంఠం భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకొని సత్తెమ్మ కు సంకెళ్ల వేయడం జరిగిందని గ్రామస్తులు తహశీల్దార్ నరసింహ కుమార్‌కు సమర్పించారు. తహశీల్దార్ తన సిబ్బందికి సర్వే చేసి గ్రామకంఠం భూమికి హద్దులు ఏర్పరిచి ఆక్రమించుకున్న భూమిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. మంగళవారం నాడు రెవిన్యూ సిబ్బంది గ్రామంలోకి వెళ్లి సర్వే నిర్వహించి ఆక్రమించుకున్న భూమిని ఖాళీ చేయాలని ఆక్రమణదారుడిని తెలిపారు. ఆక్రమించుకున్న భూమిలో ముళ్లకంచెను తొలగించాలని ఆదేశించారు. తహశీల్దార్ ఇంత త్వరగా స్పందించి తమకు న్యాయం చేశారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో విఆర్ఒ సోమశేఖర్‌రెడ్డి, విఆర్ఎ


ఆక్రమిత భూమిలో ఏర్పాటు చేసిన కంచెను తొలగింపజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుబ్బరాయుడు, సర్వేయర్ మహర్షి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

- మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు


టిడిపి నాయకుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ములకలచెరువు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి, పోలిట్ బ్యూరో సభ్యులుకాల్వ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. ఇటీవల చంద్రబాబు పర్యటనలో భాగంగా అంగళ్లులో జరిగిన గొడవలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు.కొందరు నాయకులను అరెస్ట్ చేశారు. మంగళవారం మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, తంబళ్లపల్లె నియోజకవర్గం, బి కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల్లోని టిడిపి కార్యకర్తలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ వైసిపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. అధికార పార్టీ నాయకులకు పోలీసులు ప్రొత్సహిస్తున్నారని విమర్శించారు మరికొంత మందిపై అభియోగం మోపి కేసులు బనాయించడం సబబు కాదన్నారు. రాష్ట్ర టిడపి కార్యనిర్వహక కార్యదర్శి పర్వీనాజ్, నాయకులు ప్రభాకర్, శ్రీనివాసులు, మస్తాన్ రెడ్డి, గంగాదేవి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీకి నిధులు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట గ్రామ శ్మశాన వాటిక ప్రహరీ గోడకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి మంగళవారం కలెక్టర్ గిరీషకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్‌స్కూల్‌లో గుంతలు పూడ్చివేతకు, శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కలెక్టర్ హామీ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒ తిరుమలరావు, ఆర్ఐ నవీన్, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, భోగా పార్థసారథి, రెడ్డిపల్లె ఎంపిటిసి ఆలం చంగయ్య, శివారెడ్డి, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్సలు ప్రారంభం


శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ ధరణి కుమార్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో శస్త్ర చికిత్సలు ప్రారంభించినట్లు జనరల్ సర్జన్ డాక్టర్.రేకూరి ధరణికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని వసతులు కమ్యూనిటీ ఆస్పత్రి నందు సౌకర్యాలు ఉన్నాయన్నారు. శస్త్ర చికిత్సలలో భాగంగా లైపోమా, సెబెసియస్ సిస్ట్, ఫిస్టులా, వరిబీజము, మొలలు, అపెండిసైటిక్స్, బొడ్డు దగ్గర గడ్డలు, చాతిలో గడ్డలు, కాళ్లలో నరాలు ఉబ్బటం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలోఆస్పత్రి సూపరింటెండెంట్ నిలోఫర్ బేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ జిల్లా అధికారిని నియమించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు ఉర్దూ జిల్లా అధికారిని నియమించాలని అల్‌మేవా ప్రధాన కార్యదర్శి అసదుల్లా షా డిమాండ్ చేశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కొత్తగా ఏర్పడిందని చిత్తూరు జిల్లా నుంచి ఉర్దూ పాఠశాలలు అన్నమయ్య జిల్లాలో వీలినమైనందున ప్రాథమిక పాఠశాలలు 98, ప్రాథమికోన్నత పాఠశాలలు 46, ఉన్నత పాఠశాలలు 24 మొత్తం ఉర్దూ 168 ఉర్దూ పాఠశాలలున్నాయని చెప్పారు. వీటిని పర్యవేక్షించడానికి ఒక ఉర్దూ అధికారి అవసరం ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తుసుకెళ్తానని అన్నారు. అందుకు అల్‌మేవా సభ్యులు విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్, అల్‌మేవా ట్రెజరర్ సునీర్, ఎస్‌టియు మైనారిటీ కన్వీనర్ బాష, డైట్ లెక్చరర్ రెడ్డయ్య, అంజద్ బాషా పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పీలేరు

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందాక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె విశ్వనాథ సూచనల మేరకు ఛలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్నామని ఎంఆర్పిఎస్, ఎం.ఎస్.పి అన్నమయ్య జిల్లా ఇన్చార్జి కెఎన్ రాజు మాదిగ తెలిపారు. మంగళవారం మండలంలోని తలుపుల పెద్దమాదిగపల్లి, మేళ్లచెరువు, విద్యానగర్ గ్రామాల్లో జిల్లా ఇంచార్జ్ కెఎన్ రాజు మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు, పీలేరు ఇంచార్జ్ గండికోట వెంకటేష్ సంయుక్తంగా పర్యటించారు. చదువుతోపాటు ఎస్‌సి వర్గీకరణ చాలా ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పికె ఎన్ రాజు మాదిగ, గండికోట వెంకటేష్, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జి సంధి పాకుల ఎర్రయ్య, మహేష్, రమణ, ఎర్రయ్య, పాండు, సిద్ధయ్య, బాబు, శ్రీరాములు, మల్లికార్జున, శివ, అన్నవరం, నిర్మల, రెడ్డమ్మ, మాధవి మల్లీశ్వరి, లక్ష్మీదేవి, సుశీల, మునెమ్మ పాల్గొన్నారు.



గోదామును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ రవీందర్‌రెడ్డి

పౌరసరఫరాల గోదాము తనిఖీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని పౌరసరఫరాలశాఖ గిడ్డంగిని కొలతలు తూనికల శాఖ కడప అసిస్టెంట్ కంట్రోలర్ రవీందర్‌రెడ్డి బృందంచే ఆకస్మిక తనికి చేశారు.ఈ సందర్భంగా తూనికలు, పరికరమును క్షుణ్ణంగా పరిశీలించి తూకాలు సరిగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్క చౌక దుకాణానికి వంద శాతం తూకాలు వేసి బియ్యం సరఫరా చేయాలని గోడౌన్ ఇన్‌ఛార్జి కి సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గోడౌన్ ఇన్‌ఛార్జి మల్లికార్జునబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


ప్రమాదకరంగా వంగి ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు గ్రామపంచాయతీలో చెరువు కట్టపైన విద్యుత్ స్తంభం వంగిపోయి చాలా ప్రమాదకరంగా ఉందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్తంభం కూలితే నష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోలన వ్యక్తం చేశారు. విద్యుత్ ఎఇ శ్రద్ధ చూపి విద్యుత్ స్తంభమును మార్చాలని కోరారు.


ప్రజా దర్బార్‌లో సమస్యలపై మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. అలాగే జరుగుతున్న పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చూడాలని వారికి తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా అని ఆరాతీయాలన్నారు. అనంతరం వీరబల్లిలోని రెండవ వార్డ్ మెంబర్ నార్జాల నాగ ప్రసాద్, సోమవారం కొన్న నూతన వాహనాన్ని ఎంపిడిఒ మల్లేశ్వరి ప్రారంభించారు. అనంతరం మండలంలోని గుర్రప్పగారిపల్లి వద్ద ఆర్‌కెటి రోడ్డు నుంచి వీరబల్లి, రెడ్డివారిపల్లి వద్ద మట్లి, యల్లంపల్లి, ఓడివీడు సి. టి.కె.తొగటపల్లి, దళితవాడ మీదుగా పల్లెలను కలుపుతూ రూ.308.62 లక్షలతో 5.60 కే.మీ గల రహదారులను జడ్‌పిటిసి శివరాం తో కలసి కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వంగిమల్ల సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, పెద్దవీడు సర్పంచ్ నాగిరెడ్డి ,సంఘం వాండ్ల పల్లి సర్పంచ్ నరసింహులు, పెద్దవీడు సింగిల్ విండో ప్రెసిడెంట్ అమర్నాథ్ రెడ్డి, శ్రీరాములురెడ్డి, సబ్బరామరాజు, రెడ్డప్ప రెడ్డి , జగిలిబాబు, నరసింహులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర పరిశీలకులు

ఓబులేటి కుంటను పరిశీలించిన కేంద్ర పరిశీలకులు

ప్రజాశక్తి-రామాపురం

మండలం సుద్దమళ్ళ గ్రామంలో ఉన్న అమ్రుత్ సరోవర్ కింద ఓబుల్ రెడ్డి కుంటలో జరిగిన పనులను మంగళవారం సెంట్రల్ పరిశీలకులు డాక్టర్ లీలావతి పరిశీలించారు. ఈ సందర్భంగా కుంట ఎంత లోతు ఉండాలి, ఎంత విస్తీర్ణం ఎంతమంది కూలీలు చేశారు, ఎంత పని చేసిందనే విషయంపై ఆమె ఉపాధి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఈ కుంటలో రూ.6.70లక్షల కూలీలు పనులు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, ఎపిడి రెడ్డప్పనాయుడు, ఎపిఒ సురేంద్రనాథ్‌రెడ్డి, ఇసి శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, అమీర్‌బాషా, నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రవిచంద్ర

విద్యార్థుల జాబితా ఆన్‌లైన్‌లో ఉంచాలి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాబితా ఆన్‌లైన్ లో నమోదు చేయాలని మండల ప్రత్యేక అధికారి రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల, పాపేపల్లి, సి.గొల్లపల్లి ఎన్ ఓ పల్లి కోటకాడపల్లి , గ్రామ సచివాలయంలో వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ తమ పరిధిలో ఉన్న ఒకటవ తరగతి నుండి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసి, బడి బయట విద్యార్థులు వివరాలు సేకరించి అధికారులు దృష్టికి తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు మనోహర్, రామకృష్ణ, పంచాయతీ ఇఒపిఆర్‌డి జనార్ధన్, కార్యదర్శిలు జగన్, ఖాదర్ భాష, ప్రసన్న లక్ష్మీ, ఓబులమ్మ, బాలాజీ, రెడ్డిమొహమ్మద్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ అందించడం అభినందనీయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హెచ్‌పి పెట్రోల్ బంక్ ద్వారా వినియోగదారులుకు, వాహన దారులకు నాణ్యమైన పెట్రోల్ సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని గాలివీడు రహదారి మార్గంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా కౌన్సిలర్, ప్రొపయిటర్ సాధిక్ ఆలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష తో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి నాయకులు షబ్బీర్, రియాజ్, మానవతా ఎర్రపురెడ్డి బ్రహ్మానంద రెడ్డి, రాయచోటి రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, మూసా పాల్గొన్నారు.